

శివరాత్రికి ఆలయం అందంగా ఉండాలి : బొజ్జల

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని అన్ని విధాలుగా ముస్తాబు చేయాలని స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం ఆయన దేవస్థానం అధికారులతో ఆలయంలో పరిశీలించారు. ఎక్కడెక్కడ ఏ లోపాలున్నాయి, ఏ విధంగా అలంకరణ చేయాలనే విషయమై ఆయన అధికారులతో చర్చించారు. అనేక సూచనలు చేశారు. విద్యుత్ దీపాలు, పూల అలంకరణ ఏవిధంగా చేయాలో అధికారులకు వివరించారు. టిడిపి నాయకులు విజయ్ కుమార్ నాయుడు, చెంచయ్య నాయుడు, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, ఆలయ ఈఈ మురళీ ధర్ రెడ్డి, ఏఈఓ లోకేష్ బాబు, శానిటరీ ఇన్స్పెక్టర్ వెంకట కష్ణారెడ్డి ఎమ్మెల్యేతో పాటు పాల్గొన్నారు.

'పెయిడ్' పార్కింగ్..!

ప్రైవేట్ 'అడ్డా'గా మాస్టర్‌ప్లాన్ రోడ్లు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

నగరంలో కొత్త మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్ వైపు నూతనంగా గత ఏడాది మాస్టర్‌ప్లాన్ రోడ్డు వేశారు. ఈ రహదారిని ఉదయం నుంచి రాత్రి వరకూ ప్రైవేట్ వాహనాల పార్కింగ్ అడ్డాగా మార్చేశాయి. ప్రైవేట్ స్కూలు బస్సులు, ప్రైవేట్ వాహనాలు పార్కింగ్ చేయడంతో చుట్టుపక్కల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికకూ ఫిర్యాదులు వచ్చాయి. ట్రాఫిక్ పోలీసుల నిఘా లేకపోవడంతో ఇష్టారాజ్యంగా 'పార్కింగ్' అడ్డాగా ఈ రహదారి మారిపోయింది. అలాగే తిలక్‌రోడ్డులోని శ్రీదేవికాంప్లెక్స్ పక్కనే నూతనంగా మాస్టర్‌ప్లాన్ రోడ్డు వేశారు. అక్కడ రోడ్డుకు ఇరువైపులా పెద్దపెద్ద వాహనాలు పెట్టడం వల్ల నవాబుపేట, బిఎస్ఎన్ఎల్ కార్యాలయానికి వెళ్లే వాహనదారుల అవస్థలు వర్ణనాతీతం. ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మాస్టర్‌ప్లాన్ రోడ్లు ప్రైవేట్ వాహనదారుల రాజ్యంగా మారిపోయింది. ఎంఆర్‌పల్లి మాస్టర్‌ప్లాన్, డిబిఆర్, చింతలచేను, హీరోహోండా సమీపంలో ఏర్పాటు చేసిన మాస్టర్‌ప్లాన్ రోడ్లలో ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యం లబ్ధి పొందుతున్నారు. గతంలో ప్రైవేట్ ట్రావెల్స్‌వారు ఖాళీ స్థలాలను ఎంపిక చేసుకుని, లీజుకు తీసుకుని వాహనాలను పార్కింగ్ చేసేవారు. నెలనెలా ట్రావెల్స్ యాజమాన్యం ఖాళీ స్థలం యజమానికి అద్దె రూపంలో ఎంతోకొంత చెల్లించేవారు. ప్రస్తుతం మాస్టర్‌ప్లాన్ రహదారులు ప్రైవేట్ ట్రావెల్స్, స్కూలు బస్సులు, అంబులెన్స్‌లు, భారీ వాహనాల వారు నిలుపుకోడానికి సౌలభ్యంగా ఉన్నాయి. రోడ్లపైనే వాహనాలను సైతం కడిగి శుభ్రం చేసి ఆరబెట్టేస్తుండటం గమనార్హం.

'ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు మాస్టర్‌ప్లాన్ రోడ్లను వేశారు.. ట్రాఫిక్ సమస్య పరిష్కారమయ్యిందో లేదో గానీ, ప్రైవేట్ వాహనాలకు పార్కింగ్ అడ్డాగా ఆ రహదారులు మారిపోయాయి. విశాలమైన రహదారుల్లో వరుసగా ప్రైవేట్ వాహనాలను రోజుల తరబడి నిలిపేస్తున్నారు. అదేమని కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మౌర్యను 'ప్రజాశక్తి' వివరణ కోరగా 'పార్కింగ్ ఫీజు' ప్రతిపాదన ఉందని చెప్పడం గమనార్హం. ఏదిఏమైనా ఆదాయ ప్రయత్నాల్లో కార్పొరేషన్ తహతహలాడుతోంది.

'పార్కింగ్ పెయిడ్' పరిశీలిస్తున్నాం : కమిషనర్

మాస్టర్‌ప్లాన్ రోడ్లల్లో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు, స్కూలు బస్సులు, ఇతర వాహనాలు పెట్టడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. మాస్టర్‌ప్లాన్ రోడ్లను కేవలం వాహనదారులతో పాటు, ప్రజలు ఇబ్బందులు పడకుండా ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి నిర్మించాం. కొంతమంది తమ వాహనాలను సాయంత్రం నుంచి రాత్రి, ఉదయం పూట వరకు పెట్టడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వాహనదారులకు ఇబ్బంది కలిగించేలా పార్కింగ్ చేస్తే చర్యలు తప్పనిసరి.



రోడ్డుపైనే ప్రైవేట్ వాహనాల అడ్డా



స్కూళ్ల పర్యవేక్షణకు క్లస్టర్ విధానం

విద్యార్థులు తక్కువుంటే సమీప పాఠశాలల్లో విలీనం

రాష్ట్రపాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు

ప్రజాశక్తి -తిరుపతి

పాఠశాలలపై పర్యవేక్షణ పెంచేందుకు క్లస్టర్ విధానాన్ని తీసుకొచ్చినట్లు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు పేర్కొన్నారు. సోమవారం స్థానిక మహతి ఆడిటోరియంలో పాఠశాల విద్య బలోపేతం, నూతన విద్యా విధానం పై రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు తిరుపతి, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, సుమిత్ కుమార్, తిరుపతి, చిత్తూరు జిల్లాల విద్యాశాఖాధికారులు కె వి ఎన్ కుమార్, వరలక్ష్మి, ఎంఈఓలు, క్లస్టర్ హెచ్‌ఎం లతో కలిసి ప్రాంతీయ సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యాశాఖ డైరెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాల విద్యలో తీసుకొస్తున్న మార్పులు, జీఓ 117 రద్దు, నూతనం గా తీసుకొచ్చిన క్లస్టర్ విధానంతో కలిగే ప్రయోజనాలు తదితర వాటి గురించి కమిషనర్ వివరించారు. స్కూల్ క్లస్టర్ విధానంలో ఆ క్లస్టర్ పరిధిలోని స్కూళ్లపై మండల స్థాయి అధికారి పర్యవేక్షణ చేస్తున్నారని, దీని వల్ల సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. అందుకే క్లస్టర్ విధానాన్ని తీసుకొచ్చామని, దీని వలన ఆయా క్లస్టర్ పరిధిలోని స్కూళ్లపై ఆ క్లస్టర్ హెచ్‌ఎం ప్రతి రోజు పర్యవేక్షణ చేయడంతో ప్రయోజనం ఉంటుందన్నారు. అయితే ఇక్కడ ఎంఈఓలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు ఉంటాయని, ఎవరూ ఆందోళన చెందకూడదని, ఎంఈఓల పవర్స్ వారికే ఉంటాయని చెప్పారు. ఇకపై మండల విద్యాధికారుల బదిలీలకు కౌన్సెలింగ్ ఉండదని, తహసీల్దార్లు, ఎంపీడీఓల బదిలీల మాదిరిగానే ఉంటాయన్నారు. స్కూళ్ల ఎన్రోల్మెంట్లో తప్పులు ఉంటున్నాయని, వాస్తవమైన వివరాలు మాత్రమే ఆన్లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఓ మోడల్ ప్రైమరీ పాఠశాల ఏర్పాటు చేస్తామని పాఠశాల విద్య కమిషనర్ చెప్పారు. ప్రాథమికోన్నత పాఠశాలలను ఇకపై కొనసాగించే ఉద్దేశం లేదన్నారు.

ప్రతి గ్రామంలో ఆదర్శ పాఠశాల

పాఠశాల కేంద్రంగా అమలవుతున్న విద్యా విధానాలు క్షేత్ర స్థాయిలో ఆచరణాత్మకంగా సత్ఫలితాలు సాధించాలని తెలిపారు. పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విద్యాశాఖ అధికారులకు,ప్రధానోపాధ్యాయుకు పిలుపునిచ్చారు. తిరుపతి చిత్తూరు జిల్లా విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో జీవో నం.117 ఉపసంహరణ, అనంతరం పరిణామాలు, ప్రత్యామ్నాయ పరిస్థితులపై చర్చించారు. ప్రతి గ్రామంలో ఆదర్శ ప్రాథమిక పాఠశాల అవసరం ఉందన్నారు. పాఠశాలల్లో పిల్లల సంఖ్య తక్కువగా ఉన్న చోట రెండు గ్రామాలకు కలిపి ఒకే చోట ప్రాథమిక ఆదర్శ పాఠశాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో 80 మంది విద్యార్థుల సంఖ్య తగ్గకుండా పాఠశాలను ఏర్పాటు చేసి, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చూడాలన్నారు. తిరుపతి జిల్లాలోని కొన్ని మండలాల్లో బోగస్ విద్యార్థుల ఎన్రోల్మెంటు సంఖ్య 2 వేలకు పైగానే ఉందని, ఈ విషయంలో సంబంధిత అధికారులను, ప్రధానోపాధ్యాయులపై వేటు తప్పదని హెచ్చరించారు. తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య , గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్ డి ఓ లు రామ్మోహన్, భాను ప్రకాష్ రెడ్డి, కడప ఆర్జేడీ శామ్యూల్ పాల్గొన్నారు

చిరు వ్యాపారులకు భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా నలుమూలల నుండి ప్రజలు పెద్ద ఎత్తున అర్జీలు ఇవ్వడానికి క్యూ కట్టారు. మరికొందరు జిల్లా కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో వారు తీసుకొచ్చిన అర్జీలను వెనక్కు తీసుకొని వెళ్ళిపోయారు. మరికొందరు ఎన్నిసార్లు అర్జీలు ఇచ్చిన తగిన పరిష్కారం చూపలేదని బహిరంగంగా మీడియాకు చెప్పారు. కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 261 అర్జీలు రాగా అందులో రెవిన్యూ శాఖకు సంబంధించి 158 అర్జీలు వచ్చాయి. తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో తోపుడుబండ్ల వ్యాపారులపై నగరపాలక సంస్థ అధికారులు అణిచివేత ధోరణి పాటిస్తూ తోపుడుబండ్లను ఎత్తుకెళ్లిపోతున్నారని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు, నేతలు సుబ్రమణ్యం, వేణుగోపాల్, తోపుడుబండ్ల వ్యాపారస్తుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి. బుజ్జితో కలసి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి అనంతరం డిఆర్ఓ నరసింహులు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వందవాసి నాగరాజు మాట్లాడుతూ స్మార్ట్ సిటీ పేరుతో స్వశక్తితో బతుకుతున్న తోపుడుబండ్ల వ్యాపారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో బడాబడా బాబులు ఆక్రమించిన భూములను, కాలువలను నగరపాలక సంస్థ అధికారులు తమకు చిత్తశుద్ధి ఉంటే వారిపై తమ ప్రతాపాన్ని చూపాలని సూచించారు. 2014లో పార్లమెంట్లో చేసిన వీధి వ్యాపార వర్తక చట్టాన్ని తిరుపతి నగరపాలక సంస్థలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిఐటియు నేతలు వాసు, శ్రీరాములు, నరేంద్ర, చిన్నబాబు, జ్యోతి కుమార్, నారాయణస్వామి, తోపుడుబండ్ల వ్యాపారస్తుల సంఘం నాయకులు సాయి, మురళి, దాము, రఘు, మునిరత్నం, రామానుజుల రెడ్డి, వెన్నెల, శోభ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

తోపుడుబండ్ల వ్యాపారుల నిరసన

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 261 అర్జీలు



తోపుడుబండ్ల వ్యాపారుల సమస్యలు అధికారుల దృష్టికి...

కల్లుగీత కార్మికులకు గుర్తింపుకార్డులివ్వాలి : మురగన్, తడ

తిరుపతి జిల్లా తడ మండల పరిధిలోని కారూరు గ్రామంలో గత 24 సంవత్సరాల నుండి కల్లుగీత పైనే ఆధారపడి ఉన్నా మమ్మల్ని ప్రభుత్వాలు గుర్తించడం లేదు. ఇప్పటికి మూడుసార్లు కల్లుగీత కార్మికులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలని అర్జీలు ఇచ్చాం. మద్యం దుకాణాలను తమకు కేటాయించాలి.

ఎన్నిసార్లు వచ్చినా పరిష్కారం లేదు : సి.పవన్‌కుమార్, తిరుపతి రూరల్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎన్నిసార్లు అర్జీలు ఇచ్చిన క్షేత్రస్థాయి అధికారులు జిల్లా కలెక్టర్ ఆదేశాలను బేఖాతర్ చేస్తూ ప్రజా సమస్యలపై పోరాడినందుకు నాపై కేసులు పెట్టిస్తున్నారు. తిరుపతి శ్రీనివాసపురం పంచాయతీలో జి ప్లస్ 3కి అనుమతి పొంది జి ప్లస్ 5 భవన నిర్మాణం చేపట్టి కాలువను, రోడ్డును ఆక్రమిస్తున్నారని దీనిపై తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో చెప్పాము. అనంతరం నాపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేశారు. ఇప్పటికైనా ఈ అక్రమ భవన నిర్మాణం చేపట్టిన ప్రసాద్ రెడ్డి, శంకర్ రెడ్డిలపై చర్యలు తీసుకొని కాలువ రోడ్డు భూమిని కాపాడాలని కోరుతున్నాను.

జయరాంచౌదరిపై 420 కేసు పెట్టాలి

తిరుపతి టౌన్ : వేలాదిమంది రైతులకు కోట్లాది రూపాయలు చెల్లించకుండా ఇల్లు వదిలిపెట్టి పారిపోయిన దొంగ జయ రామ చౌదరిపై 420 కేసు నమోదు చేయాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి పి.హేమలత డిమాండ్ చేశారు. వందలాది మంది రైతులు కేసు పెట్టడానికి వస్తే తీసుకోకుండా, ఒక్కరు పెడితే చాలని చెప్పి, ఈ రోజు అతన్ని వేధించడం తగదన్నారు. చెక్‌బౌన్స్ కేసులు జయరాంచౌదరిపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. రైతుల్ని వేధిస్తున్న వారికి అండగా ఉంటారా, లేక రైతుల పక్షాన ఉంటారో పోలీసులు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాంబశివరాజు, గంగుల్‌నాయుడు, సురేష్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. వరి రైతులకు, పాడి రైతులకు గిట్టుబాటు ధర ప్రకటించి న్యాయం చేయాలని కోరారు.

అందరికీ సెలవులు వర్తించాలి : సిఐటియు

ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న కాంటాక్ట్, ఔట్సోర్సింగ్, సొసైటీ వర్క్, పార్ట్ టైం డైలీ వేజెస్ థర్డ్ పార్టీ కంటింజెంట్ గెస్ట్ సకల తాత్కాలిక ఉద్యోగస్తులందరికి జాతీయ సెలవులను అమలు చేయాలని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న కాంటాక్ట్ ఔట్సోర్సింగ్ సిబ్బందికి ఎటువంటి జాతీయ సెలవులు ఇవ్వడం లేదన్నారు. ఎపి కాంట్రాక్టు లేబర్ రూల్స్ 1971 ప్రకారం అందరికీ జాతీయ సెలవులు వర్తించాలని చెబుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే జీవో నెంబర్ 2ను సవరించి అందరికీ మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్ జయచంద్ర, ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి చిన్న బాబు, సిఐటియు నాయకులు కే సుమన్, యుగంధర్ పాల్గొన్నారు. అనంతరం నెల్లూరులో ఫిబ్రవరి 1-3 తేదీల్లో జరగనున్న సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలంటూ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

మెక్కింది వాళ్లు.. కట్టేది మేమా..!

చియ్యవరం వెలుగు మహిళల ఆవేదన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



తమను మోసం చేశారంటూ చియ్యవరం వెలుగు మహిళల నిరసన

సక్రమంగా బ్యాంకుకు చేరాల్సిన వెలుగు సంఘాల సొమ్ము రూ.2.29 కోట్లను పందికొక్కుల్లా మెక్కిన వాళ్ళను వదిలేసి తాము కట్టాలంటూ బ్యాంకర్లు నోటీసులు పంపడమేంటంటూ తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామ మహిళలు మండిపడ్డారు. సోమవారం మహిళలు తమకు న్యాయం చేయాలంటూ స్థానిక పిఆర్ అతిథి గహానికి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని కలిసేందుకు వచ్చారు. వారి మాటల్లో.. చియ్యవరం పంచాయితీ మాజీ సంఘమిత్రలు మునిలక్ష్మి, మునిశేఖర్ లు 56 వెలుగు సంఘాల నుంచి బ్యాంకులకు చేరాల్సిన రూ. 2.29 కోట్లు పక్క దారి పట్టించినట్లు అధికారుల విచారణలో తేలింది. దీంతో ఆ ఇద్దరు సంఘమిత్రలను అధికారులు విధుల నుంచి తొలగించారు. గడువు నిర్దేశించి రికవరీకి ఆదేశించారు. అయితే ఆ సంఘమిత్రల నుంచి సరైన స్పందన లేకపోవడంతో గత ఏడాది డిసెంబర్ 23న స్త్రీ నిధి రికవరీ క్యాంప్‌కు అధికారులు చియ్యవరం గ్రామానికి విచారణకు వెళ్లారు. 2 కోట్లా 29 లక్షలకు గాను సంఘమిత్రలు ఇప్పటివరకు రికవరీ కింద చెల్లించింది కేవలం 54 లక్షల రూపాయలు మాత్రమేనని గుర్తించారు. గతంలో దుర్వినియోగమైన స్త్రీ నిధి రుణాలతో పాటు ఇంకా నిధులు పక్కదారి పట్టినట్లు అధికారులు పసిగట్టారు. ఇచ్చిన గడువులోగా దుర్వినియోగమైన సొమ్మును కట్టకపోవడం, విచారణలో మరిన్ని నిధులు పక్కదారి పట్టినట్లు బయటకు రావడంతో గ్రామ సంఘమే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోవచ్చుని అధికారులు స్పష్టం చేసి వచ్చారు. అయితే నెల రోజులు గడుస్తున్నా మాజీ సంఘమిత్రల నుంచి సొమ్ము రికవరీ కాకపోవడం, యూనియన్ బ్యాంకు నుంచి నోటీసులు రావడంతో వెలుగు మహిళలు సోమవారం రోడ్డు ఎక్కారు. నిధుల దుర్వినియోగంలో మాజీ సంఘమిత్రలతో పాటు వెలుగు, బ్యాంకు అధికారుల పాత్ర కూడా ఉందని ఆరోపించారు. పోలీసులు సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు. రుణాలు కట్టకుంటే బ్యాంకులో ఉన్న బంగారు ఆభరణాలను జప్తు చేసుకుంటామంటూ బ్యాంకర్లు బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము సక్రమంగానే రుణాలు కట్టామనీ, కుంభకోణంలో పాత్రులైన వారిని వదిలేసి మాకు నోటీసులు ఎలా పంపిస్తారని మండిపడ్డారు. జిల్లా కలెక్టర్ ఉన్నత స్థాయి విచారణకు ఆదేశిస్తే అసలు దోషులు వెలుగులోకి వస్తారని స్పష్టం చేశారు.

అలా వెళ్లారు....ఇలా వచ్చారు...!

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుపతి తొక్కిసలాట ఘటనకు బాధ్యులను చేస్తూ కొంత మంది అధికారులపై చర్యలు తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం, పట్టుమని పదిరోజులు తిరగకుండానే తిరిగి జిల్లాకు పంపించడం గమనార్హం. తిరుపతి ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న అధికారులు అలా వెళ్లారు... ఇలా వచ్చారు... అన్న రీతిలో కూటమి ప్రభుత్వం వ్యవహరించడం పలు విమర్శలకు తావిస్తోంది.

తిరుపతి జిల్లా ఆద్యాత్మిక కేంద్రం కావడంతో ప్రశాంతతకు నిలయంగా ఉంటుంది. తిరుపతికి ఉన్న ప్రాముఖ్యత దృష్ట్యా జిల్లా కేంద్రం కాకముందే ప్రత్యేకంగా పోలీసు జిల్లాగా ఏర్పాటు చేసి, తిరుపతికే ప్రత్యేకంగా ఎస్‌పిని నియమించారు. జిల్లాల విభజనలో భాగంగా తిరుపతి జిల్లా ఏర్పడడంతో ఈ జిల్లాకు సీనియర్ ఐపిఎస్‌లను ఎస్‌పిలుగా నియమించారు. కానీ 2024 తిరుపతి జిల్లా పోలీసు వ్యవస్థలో గుర్తుండిపోయే ఏడాది. ఏకంగా ఐదు మంది ఎస్‌పిలు మారారు. ప్రత్యేకించి ప్రోటోకాల్ ప్రాధాన్యత ఉండడంతో ప్రభుత్వ పెద్దలకు అనుకూలమైన వారినే ఇక్కడ పోస్టింగ్ ఇస్తుంటారు. ఎన్నికల పోలింగ్ రోజు ఘటనలకు, కౌంటింగ్ సందర్భంగా జరిగిన ఘటనలకు బాధ్యులను చేస్తూ కొంతమంది ఎస్‌పిలను బదిలీ చేశారు. కానీ ఇటీవల తిరుపతి చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా వైకుంఠ ఏకాదశికి శ్రీవారిని దర్శించుకునేందుకు టోకన్ల జారీ సందర్భంగా భక్తుల మధ్య జరిగిన తోపులాటలో ఆరుగురు మృతి చెందారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి తిరుపతికి విచ్చేసి టిటిడి, జిల్లా ఉన్నాతాధికారులతో సమీక్ష నిర్వహించి, ఈ ఘటనకు బాధ్యులను చేస్తూ ఒక డిఎస్‌పిని, టిటిడికి చెందిన డిప్యూటీ ఈవోను సస్పెండ్ చేశారు. పర్యవేక్షణ లోపం కారణంగా ఐపిఎస్ అధికారి జిల్లా ఎస్‌పి సుబ్బారాయుడుని, ఐఎఎస్ అధికారి టిటిడి జెఈవో గౌతమి, మరో ఐపిఎస్ అధికారి టిటిడి సివిఅండ్ ఎస్‌వో శ్రీధర్‌ను బదిలీ చూస్తూ నిర్ణయం తీసుకుని, తక్షణమే చర్యలు అమలయ్యేలా ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవానికి కొత్త పద్దతులను అవలంభించి, ఈ ఘటనకు ప్రధాన కారణమైన టిటిడి ఈవో, అడిషనల్ ఈవో, పాలకమండలి చైర్మన్లపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ బాధితులను పరామర్శించిన వెంటనే డిమాండు చేశారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. డిప్యూటీ సిఎం ప్రకటన చేసిన గంట వ్యవధిలో కిందస్థాయి ఉద్యోగులపై చర్యలతో చేతులు దులుపుకోవడం కొసమెరుపు. కానీ ముఖ్యమంత్రికి అత్యంత ఆప్తుడైన ఐపిఎస్‌లను కేవలం 10 రోజుల వ్యవధిలోనే అదే జిల్లాకు ఇతర విభాగాల్లో నియమించారు. తిరుపతి ఎస్‌పిగా, రెడ్‌సాండిల్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జిగా ఉన్న సుబ్బారాయుడును పోలీసు హెడ్‌క్వార్టర్‌కు బదిలీ చేసిన ప్రభుత్వం, కేవలం పట్టుమని పది రోజులు కూడా కాకుండా తిరుపతి కేంద్రంగా పని చేసే రెడ్‌సాండిల్ టాస్క్‌పోర్సుకు పూర్తిస్థాయి ఎస్‌పిగా నియమించింది. టిటిడి సివిఅండ్‌ఎస్‌వోగా పని చేసిన శ్రీధర్‌ను సిఐడి ఎస్‌పిగా నియమించారు. తమకు అనుకూలమైన మరో ఐపిఎస్ అధికారి ఇదే తిరుపతి జిల్లా ఎస్‌పిగా పని చేసి 6 నెలలకు ముందు బదిలీపై వెళ్లిన వ్యక్తిని తిరిగి తిరుపతి ఎస్‌పిగా నియమించారు. దీంతో ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తే ఎవ్వరైనా, ఎలాంటి తప్పులు చేసినా అండగా ఉంటామని ప్రభుత్వం వీరి నియామకాలతో రుజువు చేసిందని ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. ఏది ఏమైన అత్యంత బాధాకర ఘటనలకు నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు తూతూ మంత్రం చర్యల్లో బాగంగా అలా వెళ్లారు... ఇలా వచ్చారు అన్నట్టు సాగడంతో పలు విమర్శలకు తావిస్తుండడం గమనార్హం.

ఎమ్మెల్యే నిధులతో షాదీమహల్ అభివృద్ధి : ఎంఎల్ఎ

తిరుపతి టౌన్ : గణతంత్ర దినోత్సవాన్ని తిరుపతి అబూబకర్ షాది మహల్ నందు రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా విచ్చేసి ఘనంగా జరుపుకున్నారు .త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి స్కూల్ పిల్లలకు క్రీడా సామాగ్రిని పంచిపెట్టారు.షాదీమహల్ మరమ్మతు పనులను ఎంఎల్ఎ నిధులతో చేయిస్తానన్నారు. కూటమి నాయకులు నరసింహయాదవ్, దంపూరు భాస్కర్, కోడూరు బాలసుబ్రమణ్యం, అనిత, రహిమాని మజీద్ ముతువల్లి, మహబూబ్‌బాషా, ఇస్తామయిల్ పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల అభివృద్ధికి చర్యలు

తిరుపతి టౌన్ : లోతట్టు ప్రాంతాలైన కొరమేనుగుంట, గొల్లవానిగుంటల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా అభివృద్ధి చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు. సోమవారం ఉదయం ఆయా ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, డి.ఈ.రమణ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ప్రజల నుండి వచ్చే వినతుల పరిష్కారమే మనందరి లక్ష్యమని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫోన్ ద్వారా 8 మంది, మరో 45 మంది వినతులు ద్వారా సమస్యలను విన్నవించారని అదనపు కమిషనర్ తెలిపారు. ఇందులో ముఖ్యంగా టి.డి.ఆర్. బాండ్లు ఇప్పించాలని, తాను వికలాంగుడని తన స్టాల్ తొలగించారు న్యాయం చేయాలని, నగరంలో కుక్కల బెడద తగ్గించాలని, ఉపాద్యాయ నగర్ నందు రోడ్డు ఆక్రమించి పార్కింగ్ చేస్తున్నారని, రైల్వే కాలని లో రోడ్డు మరమ్మత్తులు చేయాలని, వీధి వ్యాపారులకు గుర్తింపు ఇవ్వాలని, వారికి లైసెన్స్ లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది సంక్షేమంపై దృష్టి : ఎస్‌పి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ఎల్లప్పుడూ తమ ప్రాధాన్యత ఉంటుందని ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. తిరుపతి జిల్లా సాయుధ దళంలో అనారోగ్యంతో మరణించిన కానిస్టేబుల్ లక్ష్మీపతి సతీమణి సరితకు ఐఆర్ ఫండ్ కింద లక్ష రూపాయల చెక్కును సోమవారం అందజేశరు. ఏఓ సురేష్ బాబు, బి సెక్షన్ సూపర్డెంట్ వెంకటేశు, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు ఎం. సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.తిరుపతి జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ ఆఫీసు కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి సోమవారం హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు జే. వెంకటరావు, నాగభూషణ రావు, రామకష్ణ ఆచారి పాల్గొన్నారు.

చదువే లక్ష్యం... పోరాటమే మార్గం..!

నేడు, రేపు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

'చదువు..చదివించు..పోరాడు' అనే నినాదంతో విద్యారంగంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ (స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) నిత్య పోరాటాలు చేస్తోంది. విద్యార్థులు భావి భారత నిర్మాతలు అంటారు పెద్దలు. ఈ నేపథ్యంలో వీరు నేర్చుకునే విద్యా విధానంపైనే దేశ భవితవ్యం ఉంటుందనడంలో సందేహం లేదు. దీనికితోడు నేర్చుకున్న విద్య అబ్బాలంటే అందుకు చాలినన్ని తరగతి గదులు, తగినంత ఉపాధ్యాయులు, స్కూళ్లు, వసతి గహాల్లో మౌలిక సదుపాయాలు ఉండాలంటారు. వీటి కోసం ఎస్‌ఎఫ్‌ఐ నిరంతరం పోరాడుతోంది. విభజిత తిరుపతి జిల్లా కేంద్రంగా జిల్లాల్లోని అన్ని మండలాలు, వాటి పరిధిలోని అన్ని స్కూళ్లు, కాలేజీలకూ ఎస్‌ఎఫ్‌ఐ సేవలు విస్తరించాయి. కేవలం విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపైనే కాకుండా విద్యను ప్రైవేటీపరం చేసే నూతన విద్యావిధానంపైనా విద్యార్థులను సమీకరించి పోరాడుతోంది. దేశంలో బిజెపి ప్రభుత్వం సాగిస్తున్న హిందూత్వ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రజల్ని చైతన్యపరిచే కార్యక్రమాలు నిర్వహించింది. ఈ నేపథ్యంలో జరుగుతున్న 5వ జిల్లా మహాసభలకు ప్రాధాన్యత సంతరించుకుంది. ఏటా జరుపుకునే జిల్లా మహా సభలో ప్రభుత్వ విద్యావిధానాలు, వాటి పర్యావసానాలతోపాటు పాఠశాలలు, కాలేజీల్లో మౌలిక సదుపాయాలు, ఇతర సమస్యలు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ తదితర అంశాలపై చర్చించనున్నారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన గడిచిన ఏడాది కాలంలో విద్యార్థి ఉద్యమం ఉవ్వెత్తున సాగింది. ముఖ్యంగా ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో టిటిడి అనుబంధ విద్యాసంస్థలు, సంక్షేమ వసతి గహాల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచిత భోజన సదుపాయాన్ని కల్పించడాన్ని ఎస్‌ఎఫ్‌ఐ ఘనతగా చెప్పవచ్చు. గతంలో విద్యార్థులు మెస్, క్యాంటీన్ల ద్వారా భోజనాన్ని కొనుగోలు చేసి తినే పరిస్థితి ఉండేది. అదేవిధంగా సంక్షేమ వసతి గహాలు, పాఠశాలల్లో తాగునీరు, మెనూ అమలు, మరుగుదొడ్లు, తరగతి గదులు తదితరాల కోసం సుదీర్ఘ ఉద్యమం నడించింది. తిరుపతి, శ్రీకాళహస్తి, నాయుడుపేట, సత్యవేడు కేంద్రాల్లో విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్‌ఎఫ్‌ఐ పెద్ద ఎత్తున పోరాటాలు చేసింది. ఈ క్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఎన్నో బెదిరింపులు, నిర్బంధాలు ఎదుర్కొన్నారు. విద్యార్థుల్లో పోటీతత్వం, మేథస్సు, శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించే అనేక కార్యక్రమాలనూ ఎస్‌ఎఫ్‌ఐ చేపడుతోంది. గత కాలపు పోరాటాలు, ఎదురైన సవాళ్లు, నిర్భందాలు, బెదిరింపులు వంటి ప్రభుత్వ వైఖరిపై చర్చించడంతోపాటు భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకోనున్నామని మెలిపారు.

'నూతన విద్యా విధానం' విద్యారంగంలో అంతరాలను పెంచుతోంది.. పేదలకు చదువును దూరం చేస్తోంది.. 'చదువే లక్ష్యంగా.. పోరాటమే మార్గంగా' ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థుల పక్షాన పోరాడుతూ, 'సనాతన విద్య'పై సమరం సాగిస్తోంది.. అందరికీ చదువే లక్ష్యంగా.. పోరాటమే మార్గంగా ఎస్‌ఎఫ్‌ఐ ముందుకెళుతోందని జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అక్బర్, భగత్‌రవిలు పేర్కొన్నారు. ఎస్వీ యూనివర్సిటీ వేదికగా, మంగళ, బుధవారాల్లో జరగనున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలకు జిల్లా నలుమూలల నుంచి ప్రతినిధులు హాజరవుతారని, పోరాటాలపై సమీక్షించుకుని, కర్తవ్యాలను రూపొందించుకుంటామని 'ప్రజాశక్తి'కి తెలిపారు. సభకు ముఖ్య అతిథులుగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ హాజరవుతారు. ప్రతినిధుల సభ జరిగే స్థలానికి సీతారాం ఏచూరి ప్రాంగణంగా నామకరణం చేశారు.



విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి: డిఎస్పి

ప్రజాశక్తి - గూడూరు టౌన్: విద్యార్థులు క్రీడల్లోనూ రాణిస్తే శారీరక ధృఢత్వం పెంపుతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవచ్చని గూడూరు డిఎస్పీ గీత తెలిపారు. గూడూరు పట్టణంలోని దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాలలో నిర్వహించిన యూనివర్సిటీ స్పోర్ట్స్ మీట్ గూడూరు డిఎస్పి గీత సోమవారం ప్రారంభించారు. క్రీడలు, వివిధ విభాగాల్లో ప్రతిభ చాటిన విద్యార్థినులను గూడూరు డిఎస్పి గీత అభినందించి పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా గూడూరు డిఎస్పి గీత మాట్లాడుతూ అనేక క్రీడలలో మహిళలు రాణించి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవడం చాలా అవసరమని సూచించారు. క్రీడల్లో రాణించడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించడంతో పాటు ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. **గూడూరు టౌన్:** గూడూరు పట్టణంలోని శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సోమవారం క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్‌కు విద్యార్థులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం వారు క్రీడాజ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడల్లో రాణించిన విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాలు లభిస్తాయన్నారు. అనంతరం వారి చేతుల మీదుగా క్రీడలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి, పిఠాని చైతన్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి


సదస్సులో మాట్లాడుతున్న ఇమ్మాన్యుయేల్

ప్రజాశక్తి - గూడూరు టౌన్: విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని స్టార్ట్ అప్ అండ్ ఇండస్ట్రీ రెడీ స్కిల్స్ సదస్సు కోఆర్డినేటర్ ఇమ్మాన్యుయేల్ పేర్కొన్నారు. గూడూరు పట్టణం లోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో స్టార్ట్ అప్ అండ్ ఇండస్ట్రీ రెడీ స్కిల్స్‌పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సదస్సు కోఆర్డినేటర్ ఇమ్మాన్యుయేల్ మాట్లాడుతూ విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా, ఇంజనీర్లుగా ఎదగడానికి ఈ సదస్సు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ నైపుణ్యాలను పెంపొందించుకొని ఉన్నత స్థాయిలో ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నవీన్ కుమార్, ధనుంజయ, వేణుమాధవ్, రాజయ్య, ప్రణయ్ కుమార్, ఏవో రామయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర మహా సభలకు బియ్యం వితరణ


సిపిఎం రాష్ట్ర మహాసభలకు 20 బస్తాల బియ్యం పంపుతున్న గూడూరు సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్: నెల్లూరులో సిపిఎం 27 వ రాష్ట్ర సభలు ఫిబ్రవరి ఒకటవ తేదీ నుండి మూడవ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గూడూరు సిపిఎం ఆధ్వర్యంలో 20 బస్తాల బియ్యంను రాష్ట్ర మహాసభలకు పంపించారు. ఈ సందర్భంగా గూడూరు సిపిఎం ఆర్గనైజర్ జోగి శివకుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్న సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. రాష్ట్రంలోని సమస్యలను ఈ మహాసభలో చర్చించి తీర్మానం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వెంకటరామిరెడ్డి, పాముంజ మణి, సిఐటియు నాయకులు శ్రీనివాసులు, సురేష్, ఆర్ శ్రీనివాసులు, చంద్రయ్య, ముత్యాలయ్య పాల్గొన్నారు.

దళితులకు ఇంటి స్థలాలు ఇవ్వండి


తహశీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- కెవిబి పురం: కెవిబి పురం మండలంలోని కొత్తూరు గ్రామంలోని దళితులు 35 మంది ఇంటి స్థలాలు లేక పది ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఇంటి స్థలాల పట్టాలు ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దారు మునిరత్నంకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్దన్ మాట్లాడుతూ గత ప్రభుత్వం లో దళితులకు ఇంటి పట్టాలు ఇస్తున్నట్లు ఆన్‌లైన్లో నమోదు చేసి మోసం చేశారని, ఈ ప్రభుత్వమైనా గ్రామంలో మూడు సెంట్లు వంతున కొత్తూరు దళితులు గిరిజనులకు 35 మందికి ఇంటి స్థలాల పట్టాలు, పక్కా ఇళ్లు మంజూరు చేసి ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తహశీల్దారు మునిరత్నం మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే మూడు సెంట్లు వంతున ఇంటి స్థలాలు లబ్ధిదారులను గుర్తించాలని ఆదేశించినందున కొత్తూరు దళితులకు ఇంటి స్థలాలు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు సిపిఎం శాఖ కార్యదర్శి వరలక్ష్మి, సభ్యులు శకుంతల, సునీత, సక్కమ్మ, నాగమ్మ, గిరిజ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులు పంపిణీ

ప్రజాశక్తి- యర్రావారిపాలెం: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులు సోమవారం పంపిణీ చేశారు. పదో తరగతిలో విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి మంచి భవిష్యత్తుతో ఉన్నత స్థాయికి వెళ్లాలని ఆలోచనలతో ఎమ్మెల్యే పులివర్తి నాని ఈ కార్యక్రమం చేపట్టినట్టు ఉపాధ్యాయులు, నాయకులు తెలిపారు. మండలంలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.7వేలు, మూడో బహుమతి రూ. 5వేలు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహూకరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మండల టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత

ప్రజాశక్తి - పిచ్చాటూరు: సత్యవేడు మండలం రాజగోపాల్ గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మికి సీఎం రిలీఫ్ ఫండ్ 40 వేల రూపాయల చెక్‌ను పిచ్చాటూరు టిడిపి కార్యాలయంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ డి ఇలంగోవన్ రెడ్డి, పద్దు రాజు, ఉపాధ్యక్షులు చైర్మన్ రవి, జయ చంద్ర నాయుడు, వాసు రెడ్డి, చిన్న ఢిల్లీ, కొల్లాపూరు, నాగేంద్ర పాల్గొన్నారు.

సమగ్ర చట్టం అమలు చేయాలి


మాట్లాడుతున్న సిఐటియు నాయకులు మధుసూదన్

ప్రజాశక్తి - తిరుపతి: బిల్డింగ్ రంగంలోని ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికులకు సమగ్ర చట్టం అమలు చేయాలని సిఐటియు జిల్లా సభ్యులు మధుసూదన్ రావు, సిఐటియు మండల కన్వీనర్ ప్రసాద్ డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికులకు ఉన్న చట్టాలను అమలు చేయాలని కోరారు. సంఘం అధ్యక్షులు అగస్టీన్ కార్యదర్శి వెంకటేష్ ఆధ్వర్యంలో పాకాల మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి చిత్తూరు రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంఘం కార్యాలయంలో బాలాజీ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమగ్ర చట్టం అమలు అయితే కార్మికులకు భద్రత పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యాలు, కార్మికులకు హక్కులను సాధించు కోవాలన్నారు. గత నేటి ప్రభుత్వాలు కార్మికులకు ఉన్న సంక్షేమ పథకాలను అన్నింటిని అమలు చేయాలని నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో అగస్టీన్ ,వెంకటేష్ , ముని కృష్ణారెడ్డి, బాలాజీ, గంగాధర్ సబీర్, వెంకటరమణారెడ్డి, భాస్కర్, ఉమాపతి పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి: కలెక్టర్


కాంట్రాక్టు ఎంప్లాయిస్ టేబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేసే కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ టేబుల్ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కాంట్రాక్ట్ కార్మికులు తమ ఎదుర్కొంటున్న పలు సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాను కార్మికుల పక్షపాతి కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తన వంతు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. టేబుల్ క్యాలెండర్ ఏర్పాటు చేయడం వల్ల కాంట్రాక్ట్ కార్మికులకు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ తిరుపతి జిల్లా అధ్యక్షులు గోపీనాథ్ రెడ్డి, కార్యదర్శి సత్యనారాయణ, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ తిరుపతి జిల్లా అధ్యక్షులు పేట కరిముల్లా కార్యదర్శి హేమంత్ కుమార్, కోశాధికారి జయశంకర్, వైస్ ప్రెసిడెంట్ అంకయ్య, దేవ శివకుమార్, రత్నకుమార్ పాల్గొన్నారు.

దళితుడిపై హత్యాయత్నం చేసిన వారిపై కఠిన చర్య తీసుకోవాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుమలలో చిన్నపాటి వ్యాపారం చేసుకుంటున్న బోయన బాబుపై కొంతమంది ఉద్దేశపూర్వకంగా హత్య చేయడానికి ప్రయత్నం చేస్తే అట్టి వారిపై పోలీసులు నామమాత్రపు సెక్షన్లతో కేసులు నమోదు చేయడం ఏంటని, దళితుడిపై హత్యాయత్నం చేసిన వారిపై కఠిన శిక్షలు పడేలా సెక్షన్లు నమోదు చేయాలని ఎస్సీ, ఎస్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు గౌడ పేరు చిట్టిబాబు జిల్లా ఎస్పీకి వినతిపత్రాన్ని అందించారు. సోమవారం తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఈ మేరకు బాధితుడు బాబు సతీమణి యశోదతో కలిసి వాస్తవాలను ఎస్పీకి వివరించారు. తిరుమల వైసిపి యువజన విభాగం విభాగం అధ్యక్షుడిగా ఉన్న ప్రవీణ్ బాబు మద్యపరిత్వంతో తన హోటల్ అభివృద్ధికి బాబు స్నేహితుడు నుండి 30 లక్షల రూపాయలు తీసుకున్నారని, ఆ డబ్బులు తిరిగి అడిగినందుకుగాను జరిగిన వాగ్వివాదాల నేపథ్యంలో ఈ హత్యాయత్నం కుట్ర చేశారన్నారు. జిల్లా ఎస్పీ అర్జీ ఇచ్చిన కార్యక్రమంలో సుబ్బయ్య, సుధాకర్, చిన్నం పెంచలయ్య, కేశారి రాధాకృష్ణ, మధు, మునిరాజా దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటారు..

ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్ టోర్నమెంట్లో గూడూరు వాసి దండు లక్ష్మిసిరికి ద్వితీయ స్థానం


ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్ టోర్నమెంట్లో అద్భుత ప్రతిభ చూపిన దండు లక్ష్మిసిరి

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరుకు చెందిన దండు లక్ష్మీసిరి టెన్నిస్ పోటీల్లో అద్భుత ప్రతిభ ప్రదర్శించి గూడూరుకు వన్నె తెచ్చింది. ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్ టోర్నమెంట్‌లో ద్వితీయ స్థానం సాధించి ఫిబ్రవరిలో డెహ్రాడూన్‌లో నిర్వహించే నేషనల్ గేమ్స్‌లో ఆడేందుకు ఎంపికైంది. ఈ సందర్భంగా దండు లక్ష్మీసిరిని పలువురు అభినందనలతో ముంచెత్తారు.

ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్ (ఐటా) ఉమెన్స్ 2.5 లాక్స్ టోర్నమెంట్ కొచ్చిలో ఈనెల 20 తేదీ నుండి 25వ తేదీ వరకు నిర్వహించారు. గూడూరు పట్టణానికి చెందిన దండు లక్ష్మీ సిరి టోర్నమెంట్లో రన్నర్‌గా నిలిచింది. ఈనెల 20వ తేదీ సోమవారం మొదటి రౌండ్ దాసరి శ్రీ తన్వి కర్నాటక పై 7-5-6-0 స్కోరుతో గెలిచింది. మంగళవారం రెండవ రౌండ్ విధుల అమరే కర్నాటకపై 6-2-6-2 స్కోరుతో వరుస సెట్లలో విజయం సాధించింది. మూడవ రౌండ్ క్వార్టర్ ఫైనల్‌లో కర్ణాటకకు చెందిన ప్రాచే షి పాండేపై 7-5-6-2 స్కోరుతో వరుస సెట్లలో గెలిచి సెమీఫైనల్‌కు చేరుకుంది. గత గురువారం సెమీఫైనల్‌లో మహారాష్ట్రకు చెందిన సోనాల్ పాటిల్(సీడ్2) పై 6-2-6-1 స్కోరుతో గెలిచి ఫైనల్స్‌కు చేరింది . శనివారం నిర్వహించిన ఫైనల్స్‌లో మహారాష్ట్రకు చెందిన పూజ ఇంగలె (సీడ్1) తో పోటీ పడి4-6-1-6 స్కోరుతో ఓటమి చెందింది. దీంతో ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్ ఉమెన్స్ 2.5 లాక్స్ టోర్నమెంట్లో గూడూరుకు చెందిన దండు లక్ష్మి సిరి రన్నర్‌గా నిలిచింది. దీంతో కేరళ, కొచ్చి వాసులు అభినందనలు తెలిపారు.

ఆల్ ఇండియా టెన్నిస్ టోర్నమెంట్లో గూడూరు చెందిన లక్ష్మీ సిరి ట్రైటిల్‌లో ప్రథమ స్థానాన్ని కోల్పోయిన, ద్వితీయ స్థానం సాధించడం దేశానికే తలమానికమని పలువురు పేర్కొన్నారు. ప్రతి నెలలో ఏదో ఒక టోర్నమెంట్లో విజయం సాధిస్తూ గూడూరు పేరును దేశంలోనే నిలుపుతోంది.

పలువురి అభినందనలు

భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని పలువురు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈమె ఆల్ ఇండియా ఉమెన్స్ క్యాటగిరీలో 30, జూనియర్ అండర్ -18 లో ఇండియా నెంబర్ 4 ర్యాంకులో కొనసాగుతోంది. అతి చిన్న వయసులో ఇలాంటి విజయాలను కైవసం చేసుకుంటూ గూడూరుకే వన్నె తెస్తోందని పలువురు టెన్నిస్ క్రీడాకారులు అభినందించారు. డెహ్రాడూన్‌లో ఫిబ్రవరి 5వ తేదీ నుండి 11 వ తేదీ నిర్వహించనున్న నేషనల్ గేమ్స్‌లో తెలంగాణ తరపున టెన్నిస్ క్రీడల్లో ఆడనుంది.

పీర్ల చావిడి స్థలాన్ని రక్షించండి

ముస్లిం మహిళల వినతి

ప్రజాశక్తి - ఓజిలి : ముస్లింల పీర్ల చావడి స్థలాన్ని కొంతమంది ఆక్రమించుకున్నారని వెంటనే రక్షించాలని ముస్లిం మహిళలు పెద్ద ఎత్తున తహశీల్దారు కార్యాలయం చేరుకొని తహశీల్దారు పద్మావతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓజిలి మండల కేంద్రంలోని ముస్లింలకు చెందిన సుమారు 50 అంకణాల పీర్ల చావిడి స్థలాన్ని స్థానికులు ఆక్రమించారని వాటిని తొలగించి తిరిగి అప్పగించాలని కోరారు. ఓజిలి లో సుమారు వందకు పైగా ముస్లిం కుటుంబాలు వున్నాయని పీర్ల చావడి స్థలంలో పాఠశాల నిర్మించుకొని ముస్లిం పిల్లలకు ఉర్దూ , అరబి భాషలు నేర్పించి అక్షరజ్ఞానం అందించేందుకు ఆక్రమణకు గురైన తమ స్థలాన్ని ముస్లింలకు అప్పగించాలని తహశీల్దారు పద్మావతికి విన్నవించుకున్నారు. ముస్లింల స్మశాన వాటికలో కొంతమంది మతకలహాలు రెచ్చగొట్టేందుకు పందులను, పశువులను శ్మశాన వాటికలో వదులుతున్నారని ,దీనిపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్లో ముస్లిం మహిళలు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ముస్లిం మహిళలు పాల్గొన్నారు.

రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ మూడో ఎడిషన్ ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఒరిజినల్ సౌండ్ -బాలీవుడ్ మెలొడీస్, హిప్-హాప్ బీట్స్ కలయికను కళ, సంస్కృతి, గేమింగ్ అనుభవాలతో మిశ్రమం చేసిన రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ -రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ మూడో ఎడిషన్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మ్యూజిక్ డైరెక్టర్, సింగర్ అమిత్ త్రివేది మాట్లాడుతూ ,"రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ మ్యూజిక్ అందమైన సంబరం-హృదయం నుండి నేరుగా, సహజంగా, ప్రామాణీకరంగా వచ్చిందన్నారు. గాయని నిఖిత గాంధీ మాట్లాడుతూ రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ లో పెర్ఫార్మెన్స్ చేయడం గుర్తిండిపోయే అనుభవం అన్నారు. ప్రముఖ హిప్-హాప్ కళాకారుడు రఫ్తార్ మాట్లాడుతూ , "ప్రభావం చూపించే బీట్స్, ఉద్వేగాలు ఎల్లప్పుడూ రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ లో కీలకమైన అంశంగా ఉంటాయి అన్నారు. డీజే యోగి మాట్లాడుతూ "రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ ప్రేక్షకులు మ్యూజిక్ ద్వారా సజీవమైన అనుభూతి చెందడానికి సంబంధించింది సంచలనం కలిగించే వాతావరణం కలిగించడానికి బీట్స్ ను శైలులను మిశ్రమం చేయడమే డీజేగా నా లక్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నా భాయి, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ కార్తీక్ మహేంద్ర పాల్గొన్నారు.

నేడు ద్విచక్ర వాహనదారుల హెల్మెట్ ర్యాలీ

ప్రజాశక్తి - క్యాంపస్ : మంగళవారం ఉదయం 10 గం.లకు ద్విచక్ర వాహనదారులతో హెల్మెట్ ర్యాలీ కార్యక్రమాన్ని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ ప్రధాన ద్వారం నుంచి అలిపిరి గరుడ సర్కిల్ వరకు తిరుపతి నగరంలోని అన్ని డీలర్ షో రూముల సిబ్బంది సహాయ, సహకారాలతో నిర్వహించనున్నట్లు జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. హెల్మెట్ గురించి అవగాహన కల్పించడమే ప్రధాన ఉద్దేశంగా ఈ కార్యక్రమాన్ని 36వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవ సందర్భంగా నిర్వహించను న్నామన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తిరుపతి శాసన సభ్యులు ఆరణి శ్రీనివాసులు, చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొననున్నారని, రహదారి భద్రతపై ఔత్సాహికులు హెల్మెట్ ధరించి ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

తహశీల్దారు కృతజ్ఞతలు

ప్రజాశక్తి -కోట : గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో తాను ప్రశంసపత్రాన్ని అందుకోవడం సంతోషదాయకంగా ఉందని స్థానిక తహశీల్దార్ కటారి జయ జయ రావు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం తహశీల్దార్ కే.జేజే రావు స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఉత్తమ తహశీల్దారు గా కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదగా ప్రశంస పత్రాన్ని అందుకోవడంలో రెవెన్యూ అధికారులు, రెవెన్యూ సిబ్బంది సహాయ, సహకారాలు ఉన్నాయని గుర్తు చేశారు. తాను ఉత్తమ సేవలు అందించేందుకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం: తహశీల్దారు

ప్రజాశక్తి -దొరవారిసత్రం: భూ సంబంధ సమస్యలు , వివాదాస్పద భూ సమస్యలను పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని తహశీల్దారు శైలాకుమారి అన్నారు. ఆమె సోమవారం తహశీల్దారు కార్యాలయంలో జరిగిన, ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పలు భూ సమస్యలు పై అర్జీలు ఇచ్చారు. తనియాలి పంచాయతీ పరిధిలోని బురద మడుగు గ్రామానికి చెందిన చెరువు కట్ట , భూ సమస్య రావడంతో వారు అందించిన అర్జీలను తహశీల్దారు పరిశీలించి. సర్వేయర్‌ను పంపించి పరిశీలించి న్యాయం చేస్తామని వారికి తెలిపారు. అనంతరం కృష్ణాపురం గ్రామ సమీపాన అక్కరపాకు పంచాయతీకి చెందిన భూ సమస్యపై కొందరు అర్జీలు ఇవ్వగా గ్రామానికి చెందిన కొందరు చెరువు ఆక్రమణ చేస్తున్నారని అర్జీలు ఇచ్చారు. ఈ విషయంపై తహశీల్దారు మాట్లాడుతూ రికార్డులను వివాద స్థలంను పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని అప్పటివరకు ఎవరు వివాదాలు చేసుకోకూడదని ఎవరు ఆ భూములకు పోకూడదని తెలిపారు. ప్రజా సమస్య పరిష్కార వేదికలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి ఎలాంటి అభివృద్ధి చేశారు? ఎమ్మెల్యే


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: 'గత ప్రభుత్వంలో నగరి నియోజక వర్గానికి మాజీ మంత్రి ఆర్కే రోజా ఎన్ని కంపెనీలు తెచ్చారు?ఏమి అభివృద్ధి చేశారు..?' చెప్పాలని, నెలకు రూ.5 వేల రూపాయల జీతం తో వాలంటీర్ల ఉద్యోగాలు ఇచ్చి రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు ఇచ్చేశామని చెప్పుకునే ఘన చరిత్ర వైసీపీదేనని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ అన్నారు. సోమవారం పుత్తూరు ఆర్అండ్‌బి అతిథి గృహంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమలు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమ వుతున్నారని ఇందుకు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఐటీ శాఖామంత్రి లోకేష్ కృషి చేస్తున్నారన్నారు. గత వైసిపి రాష్ట్రాన్ని నాశనం చేసిందన్నారు. ఈ సమావేశంలో పుత్తూరు పట్టణ టిడిపి నాయకులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, మాజీ మున్సిపల్ యుగంధర్, ఛైర్మన్లు ఎస్ ప్రతాప్ రాజు, డిఎస్ గణేష్, ఆనంద్, ప్రసాద్ నాయుడు, నాయకులు. బాల్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాడి రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : గొంతువాపు వ్యాధి కారణంగా పశువులను కోల్పోయిన పాడి రైతులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గడిచిన రెండు నెలల వ్యవధిలో తూర్పు మండలాల్లో గొంతు వాపు వ్యాధి విజృంభించడం వల్ల వందల సంఖ్యలో బర్రెలు, ఆవులు, దూడలు మృతి చెందినట్లు వాపోయారు. ఫలితంగా వాటినే జీవనాధారంగా నమ్ముకుని కుటుంబాలను పోషించుకుంటున్న పాడి రైతులకు తీరని దుఃఖం మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన బర్రెకు రూ.70 వేలు, ఆవుకు రూ. 50 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

క్రైం న్యూస్

హత్య కేసు ఛేదింపు

ప్రజాశక్తి - పిచ్చాటూరు: రెండు రోజుల క్రితం ప్రియుడితో కలిసి భర్తను భార్య హత్య చేసిన కేసును పోలీసులు ఛేదించి నిందితులను అరెస్టు చేశారు. ఈ మేరకు సిఐ రవీంద్ర మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ సుగంధి తన ప్రియుడు అరుల్ రాజ్‌తో కలిసి భర్త ఆంటోనీ ఉరితాడు బిగించి హత్య చేసిందని, అరుల్ రాజ్ - సుగంధిలకు గత 12 సంవత్సరాల నుండి పరిచయంతో పాటు వివాహేతర సంబంధం వుందని వీరి బంధానికి భర్త అడ్డు వస్తున్నాడని భర్త అడ్డు తొలగించుకోవాలని వ్యూహం ప్రకారం ఈ నెల 25వ తేదీ అరుల్ రాజ్ ఆంటోనీని మద్యం సేవించడానికి రాత్రి 9 గంటలకు ఫోను ద్వారా జివిఎస్ పురం సమీపంలో జనసంచారం లేని ప్రదేశానికి రప్పించారు. పీకల వరకు మద్యం తాగించిన అరుల్ రాజ్ ద్విచక్ర వాహనంలో ఆంటోనీని ఎక్కించుకుని జివిఎస్‌పురం లోని ఆంటోని ఇంట్లో అతని భార్య సుగంధి వద్దకు తీసుకెళ్లాడని తెలిపారు. ముందే తెచ్చుకున్న తాడు అతని మెడకు చుట్టి హత్య చేశామని నిందితులు అంగీకరించాని తెలిపారు. హత్యానంతరం నిందితులు పరారీ కాగా నారాయణవనం మండలం కైలాసకోన సమీపంలో వున్నట్లు గుర్తించి వారిని అరెస్టు చేసి రిమాండుకు తరలించామని పోలీసులు తెలిపారు. కేసు ను త్వరితగతిన ఛేదించిన ఎస్ఐ వెంకటేష్, అతని సిబ్బందిని సీఐ రవీంద్ర అభినందించారు.

డిటి పాడి రేఖకు ప్రశంసా పత్రం



ప్రశంసా పత్రం అందుకుంటున్న డిప్యూటీ తహశీల్దారు పాడి రేఖ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసిన సిబ్బందికి గణతంత్ర దినోత్సవ వేడుకలలో జిల్లా కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందించారు. తిరుపతి అర్బన్ తహశీల్దారుగా కార్యాలయంలో లీగల్ సెల్ డిప్యూటీ తహశీల్దారుగా విధులు నిర్వహిస్తున్న పాడి రేఖకు కలెక్టర్ ప్రశంస పత్రం బహూకరించారు.

యువగళం తోనే విజయం: టిడిపి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రెండేళ్ల క్రితం 226 రోజులపాటు 4 వేల కిలోమీటర్లు 97 నియోజకవర్గాల మీదుగా యువగళం పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకోవడం వల్లే నేడు రాష్ట్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ఇందుకు కృషి చేసిన టిడిపి జాతీయ కార్యదర్శి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్నామని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్ కుమార్ తెలిపారు. యువగళం పాదయాత్ర రెండు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా గూడూరు టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శీలం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ లోకేష్ యువగళం పాదయాత్ర నిర్వహించిన ఫలితంగానే నేడు రాష్ట్రంలో అధికారం లభించిందన్నారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, గూడూరు మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు రాజు, జిల్లా అధికార ప్రతినిధి చెంచురామయ్య, ,టిడిపి ముఖ్య నాయకులు శివకుమార్ , రహీం , ఇజ్రాయిల్ , రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

తైక్వాండోలో 'ఎస్సార్ ప్రైమ్' విద్యార్థుల ప్రతిభ


ప్రశంసా పత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): విఫా తైక్వాండో, ఆర్ఫ్ అకాడమీ వారి ఆధ్వర్యంలో ఈనెల 25, 26వ తేదీలలో బెంగుళూరు వేదికగా నిర్వహించిన నేషనల్ తైక్వాండో ఛాంపియన్షిప్ 2025 లో అండర్ 14 విభాగంలో తిరుపతి శ్రీనివాసపురంలోని ఎస్సార్ ప్రైమ్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాలను సాధించారని పాఠశాల జోనల్ ఇన్‌ఛార్జి రమేష్ తెలిపారు. సి.ఢిల్లీబాబు, కైరుబి విభాగంలో బంగారు పతకం, పుంసే విభాగంలో వెండి పతాకం డి.శరత్ కైరుబి విభాగంలో బంగారు పతకం, పుంసే విభాగంలో బంగారు పతకంతో ఛాంపియన్ షిప్ కైవసం చేసుకున్నారన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డీన్ అశోక్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఉమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నారాయణ విద్యార్థి ప్రతిభ


బహుమతి అందుకుంటున్న నారాయణ టెక్నో స్కూలు విద్యార్థిని

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: జాతీయ స్థాయిలో నిర్వహించిన గ్రీన్ వరల్డ్ పెయింటింగ్ కాంపిటేషన్ లో పట్టణానికి చెందిన నారాయణ టెక్నో స్కూలుకు చెందిన 7వ తరగతి విద్యార్థిని ఎస్.జాహ్నవి ఉత్తమ ప్రతిభ కనబరిచింది. అత్యంత ప్రతిష్టాత్మమైన ఈ పోటీల్లో జాహ్నవి తృతీయ బహుమతిని సాధించింది. విద్యార్థిని ప్రతిభ పట్ల పాఠశాల ఏజీఎం శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య అభినందనలు తెలిపారు.

శ్రావణికి డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విభాగ పరిశోధకురాలు చెరకోల శ్రావణికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు సిఈ దామ్ల నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విఎస్యు ఇన్చార్జి విసి ఆచార్య ఎస్. విజయభాస్కరరావు పర్యవేక్షణలో " స్పేషియో - టెంపో ఆల్ క్యారెక్టరెక్టిక్స్ అండ్ ఎవల్యూషన్ ఆఫ్ సాయిల్ మోయిశ్చర్ ఓవర్ ఇండియా యూజింగ్ గ్రౌండ్ బేస్డ్, శాటిలైట్ అండ్ మోడల్ డేటా సెట్స్" అంశంపై ఆమె సిద్ధాంత గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించారు. ఇందుకు ఆమెకు డాక్టరేట్ ప్రకటించారు. శ్రావణికి పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని అనేక పరిశోధన పత్రాలు సమర్పించారు. ఆమె పరిశోధనా పత్రాలు ప్రముఖ జర్నల్స్ లో ప్రచురిత మయ్యాయి. ఈ సందర్భంగా పలువురు ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

స్త్రీ సాధికారతపై సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తిరుపతిలో డిపార్ట్మెంట్ ఆఫ్ సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ఆర్థిక సహాయంతో రెండు రోజులు నేషనల్ సెమినార్ "విమెన్ ఇన్ కాన్సెంప్టరరీ సోషల్ రీమ్ ఎమర్జింగ్ స్టేటస్జీసస్" అనే అంశంపై నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి విసి ఉమ మాట్లాడుతూ మహిళలు సమస్యలు అధిగమించి వ్యాపార రంగంలో, ఉద్యోగ రంగంలో కానీ రాణించిన వాళ్ళు చాలామంది ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొ.కె.వి.సుచరిత, బ్యాంక్ రీజనల్ హెడ్, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

యువగళం..ఓ ప్రభంజనం : శాప్ ఛైర్మన్

ప్రజాశక్తి - క్యాంపస్ : యువనేత, ఐటీ శాఖ మంత్రి, నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఓ ప్రభంజనమని యువగళం వాలంటీర్ల కోఆర్డినేటర్, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. యువగళం పాదయాత్ర మొదలై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా తిరుమలలోని శ్రీవారి ఆలయం ముందున్న అఖిలాండం వద్ద 226 కొబ్బరికాయలు కొట్టి రవినాయుడు మొక్కుతీర్చుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, తిరుపతి టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ , తిరుమల ప్రధాన కార్యదర్శి శివ షణ్ముగం, తిరుమల తెలుగు యువత అధ్యక్షులు రాఘవ, వెంకటస్వామి పాల్గొన్నారు.

నేంద్రగుంటలో త్వరలో పది పడకల ఆస్పత్రి

- 20 లక్షల ఉద్యోగాల కల్పనే సీఎం లక్ష్యం
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నాని


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజాశక్తి- రామచంద్రపురం (చంద్రగిరి): పాకాల మండలం నేంద్రగుంటలో త్వరలో పది పడకల ఆస్పత్రి ఏర్పాటుకు త్వరలో పనులు ప్రారంభిస్తామని, రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి పారిశ్రామికంగా అభివృద్ధిచేసి 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే ముఖ్యమంత్రి ధ్యేయమని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. సోమవారం చంద్రగిరిలో ఎమ్మెల్యే మీడియా సమావేశంలో మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీలు ఒక్కక్కటి నెరవేరుస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఏపీ పారిశ్రామిక రంగం తిరిగి జీవం పోసుకోనుందని తెలిపారు. దావోస్ పర్యటనలో ప్రపంచ దిగ్గజాలతో సీఎం భేటీ అయ్యి రాష్ట్రానికి భారీ పెట్టుబడులు ఆకర్షించారని ఆయన పేర్కొ న్నారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారన్నారు. రాష్ట్రాన్ని 'బ్రాండ్ ఏపీ'గా మార్చేం దుకు కృషి చేస్తున్నారన్నారు. చంద్రబాబు దావోస్ పర్యటనపై వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. వైసిపి నాయకులు విమర్శలుమాని రాష్ట్ర అభివృద్ధికి సహకరిం చాలని హితవు పలికారు. గతంలో యువగళం సందర్భంగా నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు పాకాల మండలం నేంద్రగుంట లో త్వరలోనే 10 పడకల ఆసుపత్రి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెర వేర్చేందుకు ప్రయత్నిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యకర్త లకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. ఈ మీడియా సమావేశంలో మండల టిడిపి అధ్యక్షుడు వి సుబ్రహ్మణ్యం నాయుడు, ఏ ఈశ్వర్ రెడ్డి, వి రమేష్ రెడ్డి, ఎస్ గౌస్ బాషా, బాలకృష్ణ, మొక్కల చంద్రశేఖర్ రెడ్డి,, ప్రవీణ్, టి మురళీధర్ రెడ్డి, జి గోపి రాయల్, వినోద్ రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం


మాట్లాడుతున్న ఇరిగేషన్ ఏఈ రాఘవేంద్రరావు

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్: మండల సర్వసభ్య సమావేశంలో తెలిపిన వివిధ సమస్యలు వెంటనే పరిశీలించి పరిష్కరిస్తామని ఎంపిపి సంపూర్ణమ్మ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో సోమవారం ఎంపిపి పారి సంపూర్ణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయా శాఖల అధికారులు హాజరయ్యారు. ఇరిగేషన్ ఏఈ రాఘవేంద్రరావు మాట్లాడుతూ 2024 లో కురిసిన వర్షాలకు మండలంలో 34 చెరువులకు తాత్కాలిక మరమ్మతులు నిర్వహించామని శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వానికి నివేదిక పంపామని , ఏపీఓ దినేష్ కుమార్ మాట్లాడుతూ మండలంలో వెయ్యి మంది జాబ్ కార్డులు వున్నాయని రెండు లక్షల ఆరవై నాలుగు వేల పని దినాలు కల్పించామని తెలిపారు. ఇంకుడు గుంతలు ఏర్పాటుకు ప్రభుత్వం అవకాశమిచ్చిందని, విద్యుత్ శాఖ ఏఈ రాజేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి ఇంటికి సూర్య ఘర్ ద్వారా విద్యుత్ ప్రక్రియ ద్వారా ఎస్సీ ఎస్టీ లకు ఈ పథకం ఉచితం అన్నారు. ఎంపీడీవో పటాన్ రఫీ ఖాన్ మాట్లాడుతూ వాతావరణ మార్పుల ఆధారంగా ప్రతి పంచాయతీలో కార్యదర్శులు వారి వారి పంచాయతీ పరిధిలో పని చేయాలన్నారు.

విజయనగర కాలనీ అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి): చంద్రగిరి విజయనగర కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని, ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) అన్నారు. సోమవారం దీర్ఘకాలికంగా నెల కొన్న డ్రైనేజ్ సమస్య పరిష్కారానికి చేపట్టిన అండర్ డ్రైనేజ్ నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగర కాలనీ ఏర్పడి సుమారు 25 సంవత్సరాలు పూర్తి అవుతున్నా కనీస వసతులు నీళ్లు, కాలువలు, వీధి దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఎమ్మెల్యేకు సమస్యను వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే పులివర్తి నాని రెండు కోట్ల 80 లక్షల రూపాయలను అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులకు నిధులు మంజూరు చేయించారు. 45 రోజులలో అండర్ డ్రైనేజ్ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టరును, అధికారులను ఆదేశించారు. విజయనగర కాలనీ వాసులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి శాలువా కప్పి ఘన సన్మానం చేశారు. పార్కు స్థలానికి ప్రహరీ గోడ నిర్మించాలని ఎమ్మెల్యేను కోరగా గోడ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఈద్గా వద్ద నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాలును ఎమ్మెల్యే పులివర్తి నాని పరిశీలించారు. ముస్లింలకు సంబంధించిన కమ్యూనిటీ హాలును త్వరిత గతిన పూర్తి చేయాలని తుడా చీఫ్ ఇంజనీర్, కృష్ణారెడ్డి, డిఈ బాషాను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి యుగంధర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి అమ్ములు, ఆర్ మునిరత్నం రాయల్, గౌస్ బాషా, ఔరంగజేబు, మస్తాన్, కాలనీవాసులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.